# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

NOVEMBER-2018

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

క్రీస్తు సంఘములు నిర్వహించుచున్న

**POLISHING THE PULPIT** అను

గొప్ప బైబిలు లెక్చర్‌షిప్

సమయము : 2018 డిశంబరు 2వ తేదీ ఆదివారము
నుండి 6వ తేదీ శుక్రవారము వరకు
ఉదయం 10 గంటలకు
మధ్యాహ్నం 2 గంటలకు మరియు
రాత్రి 6.30 ని॥లకు

స్థలం : సత్యవాణి - క్రీస్తు సంఘము
రామారావుపేట, కాకినాడ

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన స్వదేశీ, విదేశీ సువార్తికులు వాక్యోపదేశము గావించెదరు. ప్రతి దినము స్త్రీలకు ప్రత్యేక బైబిలు తరగతులు నిర్వహించబడును. దూరము నుండి వచ్చు వారికి ఉచిత భోజన వసతి సౌకర్యములు కలవు. మొదటి రోజున 40/-లు మాత్రమే చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకొనవలెను. ప్రతి సువార్తికుడు, స్థానిక సంఘ సభ్యుడు, సభ్యురాలు తప్పక పాల్గొనవలెను. ఇది అత్యంత అరుదైన తరుణము. తప్పక వచ్చి ఆత్మీయ లాభము పొందండి.

వివరములకు దిగువ నీయబడిన నెంబర్లను సంప్రదించండి.

రిక్కీ గూటం
రోనీ గూటం
రాబిన్ గూటం
Ph : 0884 - 2363722
98489 98547, 99122 86255, 95021 84284

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి - 40 నవంబరు- 2018 సంచిక -4


## యేసు దేవుడై యున్నారు

### ( The Deity of Jesus )

లేఖనాల్లో యున్న త్రిత్వమును గూర్చి అర్థము చేసికొనాలంటే చాలా కష్టమే. అది స్వవిరుద్ధముగా యున్నట్లుగుపడుచున్నది. దేవుడు ఒక్కడే అయ్యుండి ముగ్గురు మూర్తులై ఎట్లుంటారు? ఈ ప్రశ్నకు ప్రజలు వివిధములుగా స్పందిస్తారు. కొందరు బహిరంగముగా దానిని కాదంటారు. కొందరు వివిధములుగా భావార్థము చెప్పుటకు ప్రయత్నిస్తారు. మరికొందరు నాకెందుకులేయని ఆసమస్యను పెద్దగా పట్టించుకోరు. అయితే ఈ సమస్యను శాశ్వతముగా పరిష్కరించా లని మనము కోరుకుంటాము. అయినను పరిష్కారము దొరకదు.

త్రిత్వమును మనం అర్థం చేసి కొనలేము గనుక అది సత్యము కాదని కొందరు వాదిస్తారు. దానిని నమ్ముటకు వారు నిరాకరిస్తారు. అయితే దేనినయినా మనం అర్థం చేసికొనలేకపోతే, అది సత్యముకాక పోదు. ఉదాహరణకు ఒండొరుల భావములను మనం అర్థము చేసికొన లేము. ప్రేమ అంటే యేమిటి? అదొక సమస్యకాదు గాని దానిని పూర్తిగా గ్రహించుకోలేము. అదొక మర్మము. ఎల్లకాలముండు మర్మము. అయితే ప్రేమ ద్వేషము అనే భావములు లేనట్లేనా? కానేకాదు. వెలుగును గ్రహించుకొనుటలో భౌతికశాస్త్రముకు

సమస్యే, అయినను వెలుగున్నది.

త్రిత్వము యొక్క సిద్ధాంతములో యున్న ముఖ్యభాగము యేదంటే యేసుకును దేవునికి యున్న సంబంధము. మరియు యేసు యొక్క అవతారము. అనేకులు యేసు దేవుడు కాదంటారు లేదా తండ్రియైన దేవుని కంటె తక్కువైన వాడంటారు. ఈ వ్యాసములో ఇంత పెద్ద అంశాన్ని వివరించుటకు సమయము స్థలము చాలదు. గాని యేసు యొక్క దైవత్వాన్ని గూర్చి కొన్ని ప్రాముఖ్య సంగతులను గ్రహించుకొందాము.

**యేసు సృష్టికర్త :**

తండ్రియైన దేవునితో కలసి యేసు సృష్టి కార్యక్రమములో పాల్గొన్నారని అనేక లేఖనములు తెలియజేయుచున్నవి (యోహాను 1:3, కొలస్స 1:15-17). దేవుడొక్కడు మాత్రమే దేనినైనా సృజించగలరు గనుక యేసు దేవుడైయున్నారు. తండ్రి యెట్లో అట్లే యేసు కూడా దేవుడే.

**యేసు మార్పు లేనివాడు :**

"యేసుక్రీస్తు నిన్న, నేడు ఒక్కటే రీతిగా ఉన్నాడు; అవును యుగ యుగములకును ఒక్కటే రీతిగా ఉండును" (హెబ్రీ 13:8). యేసును గూర్చి చెబుతు తండ్రియైన దేవుడిట్లు పలికెను : "ప్రభువా నీవు ఆదియందు భూమికి పునాదివేసితివి. ఆకాశములు కూడ నీ చేతి పనులే. అవి నశించును గాని నీవు నిలిచియుందువు. అన్నియు వస్త్రము వలె పాతగిలును, ఉత్తరీయు మువలె వాటిని మడిచి వేతువు. అవి వస్త్రము వలె మార్చబడును గాని నీవు ఏకరీతిగానే యున్నావు. నీ సంవత్సర ములు తరగవు" (హెబ్రీ 1:10-12). దేవుడొక్కడు మాత్రమే మార్పులేని వాడు గనుక యేసు దేవుడైయున్నారు. ఆయనలో మార్పులేదు.

**యేసు నిత్యుడు :**

ఆయన నిత్యుడని లేఖనములు ఉద్ఘాటించుచున్నవి. ఆయన ఈ లోకములో జన్మించినప్పుడు తన ఉనికిని ఆరంభించలేదు; సరిగదా ఆయన తన్ను తాను తగ్గించుకొని శరీరధారియై ఉద్భవించారు. యేసు ఆదియందుండెను, దేవుడైయుండెను. సమస్త సృష్టిని జరిగించెను. ఆయన దేవునితో ఉండెను (యోహాను 1:1). ఆయన ఎల్లప్పుడు "నిత్యుడగు తండ్రి, సమాధాన కర్తయగు అధిపతియై యుండెను" (యెషయా 9:6).

నిత్యుడగు తండ్రి యనగా ఆయన నిత్యత్వమునకు తండ్రియని అర్థము. ఆయన నిత్యము ఉండువాడు. ఉండు ననువాడు. ఏలయనగా ఆయన "పురాతన కాలము మొదలుకొని శాశ్వత కాలము ప్రత్యక్షమగుచుండెను" (మీకా 5:2). దేవుడొక్కడు మాత్రమే నిత్యుడు. యేసు నిత్యము ఉండువాడు, దేవుడు!

కొంతమట్టుకు యేసు భూమి మీద వున్నప్పుడు తన దైవశక్తిని ఇష్ట పూర్వకముగా పరిమితి చేసికొన్నారు. అందువలన ఆయన భూమి మీద వున్నప్పుడు తండ్రియైన దేవునికి పరి పూర్ణముగా విధేయుడై యున్నట్లు యనను గమనించగలము. అందును బట్టి ఆయన దేవుడు కాదని అర్థము కాదు. "ఆయన దేవుని స్వరూపము కలిగిన వాడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచి పెట్ట కూడని భాగ్యమని యెంచుకోలేదు గాని మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపము ధరించుకొని తన్నుతానే రిక్తునిగా చేసికొనెను" (ఫిలిప్పీ 2:6,7). ఈ లేఖనములో యేసు నరావతారి కాకముందు తండ్రియైన దేవునితో సమానుడుగా ఉండెనని, మానవునిగా అవతరించి నప్పుడు ఇష్టపూర్వకముగా దైవత్వ ఘనతలనుండి రిక్తుడాయెనని పౌలు బోధించుచున్నాడు.

**భూమి పై యున్నప్పుడు యేసు దేవుడు:**

అయినను ఆయన భూమిపై యున్నప్పుడు కూడ యేసు దేవుడై యుండెను. ఆయన ఒక ప్రవక్త మాత్రమే కాదు. ఆయన దేవుని నుండి వచ్చిన ఒక వర్తమానము లేక దిగువ స్థాయి కలిగిన వర్తమానికుడు కాదు. వాక్యమైన దేవుడు శరీరాకారముతో యున్నప్పుడు దేవుని యొక్క సర్వ సంపూర్ణత కలిగియుండెను. "ఏలయనగా దేవత్వము (దేవుని) యొక్క సర్వ పరిపూర్ణత శరీరముగా క్రీస్తు నందు నివసించుచున్నది" (కొలస్స 2:9). దేవుని కుమారుడైన యేసు సంపూర్ణముగా (శరీరాకారము తో) దేవుడై యుండెనని మనము గ్రహించుకోవాలని పౌలు బోధించు చున్నాడు. దైవమానవుల మిళితమే యేసుక్రీస్తు. ఆయన సంపూర్ణముగా దేవుడు. "సర్వ పరిపూర్ణత" (గ్రీకు భాషలో Pleroma) అనగా దేవుని కుండిన సర్వశక్తి, సర్వ లక్షణములు కలిగియుండుట. క్రీస్తు వాటిన్నిటిని కలిగియుండెను. ఇంకొక మాటలో

దేవునికేమైతే లక్షణములుండె నో వాటన్నిటిని యేసుక్రీస్తు పరిపూర్ణముగా కలిగి యుండెను.

**లేఖనములలో కుమారుడైన యేసు దేవుడని పలుమార్లు సంబోధించబడెను**

యూదులు ఏకైక దేవుని యందు బలముగా నమ్మువారు గనుక ఇది చాల ప్రాముఖ్యమైనది. దేవుడొక్కడే యని వారెరుగుదురు. అయినను యేసే దేవుడని కూడ వారంగీకరించారు. యేసే "నిజమైన దేవుడును, నిత్యజీవమునై యున్నాడని" యోహాను ప్రకటించాడు (1 యోహాను 5:20) యేసు "సర్వాధికారియైన దేవుడై యుండి నిరంతరము స్తోత్రార్హుడై యున్నాడు" అని పౌలు తెలియజేయు చున్నాడు (రోమా 9:5). క్రైస్తవులుగా మనము "మహాదేవుడును మన రక్షకుడునైన యేసుక్రీస్తు యొక్క మహిమ యొక్క ప్రత్యక్షత కొరకు ఎదురుచూచున్నాము" (తీతు 2:13). ఇక్కడ యేసు దేవుడును, రక్షకుడునని సంబోధింపబడిన సంగతి గమనించుము. తండ్రియైన దేవుడు "కుమారుని గూర్చి యైతే, దేవా నీ సింహాసనము నిరంతరము నిలుచునది" యని సంబోధించారు (హెబ్రీ 1:8). యేసు పునరుత్థానుడైన తరువాత తన అపొస్తులులందరికి ప్రత్యక్షమవ్వగా, తోమా ఆయనను "నా దేవా, నాప్రభువా"యని ఒప్పుకొన్నాడు (యోహాను 20:28). దేవుడు అను పదము Theos అను గ్రీకు పదమై యున్నది. ఇదే పదము తండ్రియైన దేవునికి కూడ వాడబడినది. ఇంకా యేమంటే తోమా యేసును అట్లు సంబోధించి ఆరాధిస్తే, యేసు అతనిని గద్దించలేదు, అతనికి అభ్యంతరము చెప్పలేదు. అందువలన తాను దేవుడనని యేసు చేసిన బోధలను అది సమర్థించుచున్నది (యోహాను 10:32,33).

**యేసు ఆరాధనీయుడు :**

అంతేకాదు, ఈలోకమందుండగా యేసు ఆరాధననంగీకరించారు. దేవుని తప్ప మరెవరినీ ఆరాధింపరాదని పాత నిబంధన ఖండించినది (నిర్గమ 20:1-4; ద్వితీ 5:6-9). మానవు డెవడు ఆరాధనీయుడు కాదు (అపొ.కా. 10:25-26; 14:11-15). దేవదూతలు కూడ ఆరాధింపబడరాదు (ప్రక 22:8,9). అయినను సరే యేసు ఆరాధనను స్వీకరించారు (మత్తయి 8:2; 9:18; 15:25; 20:20). ఆయన పునరు

త్థానుడైన తరువాత కూడ ఆరాధనను స్వీకరించారు (మత్తయి 28:9,17).

దేవుడొక్కడే ఆరాధింపబడాలి, యేసు ఆయన మరణమునకుముందు, తరువాత కూడ ఆరాధనను స్వీకరించారు గనుక తాను దేవుడని ఆయన ఎరిగి యుండి ఆరాధనను స్వీకరించారు. ఆయన దేవుడని మిగతా వారికి కూడ ఎరుకయే గనుక యేసు భూమి మీద యుండగా ఆయన నారాధించుట యోగ్యమైతే, ఆయన మహిమ పరచబడిన తరువాత కూడ ఆయన నారాధించుట మరింత యోగ్యమైనదే. అయినను ఆరాధించు వారు తండ్రిని ఆరాధించాలని కూడ ఆయన చెప్పారు. ఉదాహరణకు ఆయన నేర్పిన మాదిరి ప్రార్ధన (మత్తయి 6:6; 8-9) తధుపరి ఆయన సమరయస్త్రీతో, "అమ్మా ఒక కాలము వచ్చు చున్నది, ఆ కాలమందు ఈ పర్వతము మీదనైనను యెరూషలేము లోనైనను మీరు తండ్రిని ఆరాధింపరు.. అయితే యధార్ధముగా ఆరాధించు వారు ఆత్మతోను, సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చు చున్నది; అది ఇప్పుడును వచ్చే యున్నది. తన్ను ఆరాధించువారు అట్టి వారే కావలెనని తండ్రి కోరుచున్నాడు" అని చెప్పారు (యోహాను 4:21-23).

**దేవుడని తన్ను గూర్చి యేసు చెప్పుకోలేదా?**

తాను దేవుడనని యేసు ఎన్నడు చెప్పుకోలేదని కొందరు విమర్శకులు చెబుతు యుంటారు. నిజానికి యేసు దేవుడనని చెప్పుకొన్నారు. ఆయన విరోధులు ఆయన తన్ను గూర్చి చెప్పుకొనే వాస్తవాన్ని ఎరిగియున్నారు. "ఆయన విశ్రాంతి దినాచారము మీరుట మాత్రమే గాక దేవుడు తన సొంత తండ్రి అని చెప్పి **తన్ను దేవునితో సమానునిగా చేసికొనెను** గనుక ఇందు నిమిత్తమును యూదులు ఆయనను చంపవలెనని మరి ఎక్కువగా ప్రయత్నము చేసిరి" (యోహాను 5:17,18).

"యేసు తండ్రి యొద్ద నుండి అనేకమైన మంచి క్రియలను మీకు చూపితిని; వాటిలో ఏ క్రియనిమిత్తము నన్ను రాళ్లతో కొట్టుదురని వారి నడిగెను. అందుకు యూదులు నీవు మనుష్యుడవై యుండి **దేవుడనని చెప్పు కొనుచున్నావు** గనుక దేవదూషణ చేసి నందుకే నిన్ను రాళ్లతో కొట్టుదుము

గాని మంచి క్రియ చేసినందుకు కాదని ఆయనతో చెప్పిరి" (యోహాను 10:32,33).

"అందుకు యూదులు మాకొక నియమము కలదు; తాను దేవుని కుమారుడనని ఇతడు చెప్పుకొనెను గనుక ఆనియమము చొప్పున ఇతడు చావవలెనని అతనితో (పిలాతుతో) చెప్పిరి" (యోహాను 19:7).

"అయితే ఆయన ఉత్తర మేమియు చెప్పక ఊరకుండెను. తిరిగి ప్రధాన యాజకుడు పరమాత్ముని కుమారుడవైన క్రీస్తువు నీవేనా? అని ఆయననడుగగా యేసు, అవును నేనే, మీరు మనుష్యకుమారుడు సర్వశక్తుని కుడిపార్శ్వమున కూర్చుండుటయు ఆకాశమేఘారూఢుడై వచ్చుటయు చూచెదరని చెప్పెను. ప్రధాన యాజకుడు తన వస్త్రములు చింపుకొని మనకు ఇక సాక్షులతో పని యేమి? ఈ దేవదూషణ మీరు విన్నారు కారా? మీకేమి తోచు చున్నదని అడుగగా వారందరు మరణము నకు పాత్రుడని ఆయన మీద నేరస్థాపన చేసిరి" (మార్కు 14:61-64).

యేసు యొక్క నోటి నుండి వచ్చిన మరి రెండు మాటలను గమనించుడి. యోహాను 10:30లో "నేనును తండ్రియు ఏకమైయున్నామని చెప్పెను". తాను దేవుడైతే తప్ప భక్తిగల యూదుడెవ్వడు అట్లుచెప్పుకోడు. "నన్ను చూచినవాడు తండ్రిని చూచి యున్నాడని" యోహాను 14:9లో ఆయన మరల చెప్పెను. నిజానికి దేవుని యొక్క భౌతిక ప్రత్యక్షతను గూర్చి యేసు ఇక్కడ చెప్పలేదు, ఏలయనగా దేవునికి భౌతిక స్వరూపము యేమీ లేదు. దేవునికి భౌతిక దేహము లేదు. గాని దేవుని యొక్క లక్షణములన్నియు తాను కలిగియున్నానని యేసు చెప్పు కొనెను.

నిజం చెప్పాలంటే అతి క్లిష్టమైన అంశము పై యిది చాల చిన్న వివరణ యే. అయితే యేసు పరిపూర్ణ దేవుడని ఎవరు శంకించనవుసరం లేదు. తండ్రి ఎంతైతే దేవుడో యేసు కూడ అంతే దేవుడు. యిది బైబిలులో యున్న గొప్ప బోధయైయున్నది. మన పాపములకు పరిహారమునను గ్రహించుటకు దేవుడు శరీరధారియాయెను (1యోహాను4:2). యేసును దేవుని కంటే తక్కువ వానిగా చిత్రీకరించుటకు మనమెన్నడు ప్రయత్నించరాదు. ఏలయనగా ఆయన దేవుడని బైబిలు బోధించు చున్నది.

-జెర్రీబేట్స్

# దావీదు సింహాసనము

## ( The throne of David )

యేసుక్రీస్తు మరల వచ్చినప్పుడు యెరూషలేములో దావీదు సింహాసనముపై కూర్చుండి. వెయ్యేండ్లు పాలించునని వెయ్యేండ్ల పాలన వాదులు చెప్పుదురు. ఇశ్రాయేలుకు ప్రపంచ దేశాలలో ప్రాముఖ్యస్థానముండునట్లు పునరుద్ధరించబడునను భావములో యేసుక్రీస్తు భౌతికమైన వాస్తవమైన సింహాసనము పై ఆసీనుడగునను అభిప్రాయమున్నది. ఇట్టి అభిప్రాయముకు, బోధకు బైబిలలో స్థానం యేమీ లేదు.

'సింహాసనము' అను పదమును ప్రభుత్వము, ఏలుబడి అధికారము అని బైబిలును బట్టి నిర్వచింపవచ్చును. ఒకానొక దినమందు క్రీస్తు దావీదు సింహాసనాసీనుడగునని బైబిలు బోధించు చున్నది. దావీదు సింహాసనమే ఎందుకు? ఏలయనగా అతడు రాజైయుండెను (2 సమూ 7:12). అతడు దేవుని ప్రజలను పాలించెను మరియు క్రీస్తు దేవుని ప్రజలను ఏలునని వాగ్దానము చేయబడెను (యెషయా 9:6,7).

**ఆ సింహాసనము యెరూషలేము లోనే ఎందుకు ?**

దావీదు సింహాసనము యెరూషలేములో ఎట్లు స్థిరపరచబడెను? అని మొదట మనం ప్రశ్నించాలి. ఇశ్రాయేలీయుల మొదటిరాజైన సౌలు తరువాత దావీదు రాజాయెను. అమాలేకీయుల విషయములో సౌలు దేవుని ఆజ్ఞను ఉల్లంఘించెను (1సమూ 15 అధ్యా). సౌలు స్థానములో దావీదును రాజుగా అభిషేకించుమని దేవుడు సమూయేలుకు ఆజ్ఞయిచ్చెను (1సమూ 16:13). సౌలు చనిపోవు నంతవరకు దావీదు ఇశ్రాయేలీయుల రాజుగా హెచ్చింపబడలేదు. మరియు ఇశ్రాయేలీయుల పెద్దలు హెబ్రోనులో అతని అభిషేకించిరి (2సమూ 5:2,3) తదుపరి దావీదు యెరూషలేమును జయించి అక్కడ తన సింహాసనమును స్థిరపరచెను (2 సమూ 5:9).

అతడు యెరూషలేములో 33 సం॥ లు పాలించెను (2 సమూ 5:5).

క్రీ.పూ. 1095లో మొదలుకొని సౌలు మొత్తము నలుబది సంవత్సరములు రాజ్యమేలెను. మరియు క్రీ.పూ 1055 నుండి దావీదు హెబ్రోనులో పాలింప మొదలిడెను. క్రీ.పూ. 1015లో అతని ఏలుబడి యెరూషలేములో అంత మాయెను (1రాజులు 2:12). "అప్పుడు సొలొమోను తన తండ్రియైన దావీదు నకుమారుగా యెహోవా సింహాసనమందు రాజుగా కూర్చుండి వర్ధిల్లుచుండెను" (1దినవృత్త 29:23).

ఇక్కడ దావీదు సింహాసనము యెహోవా సింహాసనమని చెప్పబడెనని గమనించుము. సొలొమోను దావీదు సింహాసనము మీద కూర్చుండెను. అతడు యెహోవా సింహాసనము మీద కూర్చుండెను. అయితే సొలొమోను రెండు సింహాసనముల మీద కూర్చుండెనా? వెయ్యేండ్ల పాలన వాదులు క్రీస్తు ఇప్పుడు తన సింహాసనము మీద యున్నాడు గాని ఇంకను దావీదు సింహాసనము మీద కూర్చొనలేదని చెబుతారు! యితరులు ఆ సింహాసనముపై యుండి ఏలుబడి చేసారు. వారిలో సిద్కియా అనువాడు అఖరివాడు (2రాజులు 25:1-7 అటు తరువాత ఎవరును ఆ సింహాసనమ పై కూర్చొనకుండా క్రీస్తు మానవులన రక్షించు నిమిత్తము వచ్చు వరకు 60( సంవత్సరములు గడిచి పోయెన (లూకా 1:30-33; హెబ్రీ 2:9).

## క్రీస్తు ఏ సింహాసనము మీద ఇప్పుడున్నారు ?

క్రీస్తు ఇప్పుడు ఎక్కడ వున్నారు అనేది మన తరువాత ప్రశ్న. దావీద కు దేవుడిట్లు తెలియజేసారు. "నీ దినములు సంపూర్ణములగునప్పుడ నీవు నీ పితరులతో కూడ నిద్రించిన తరువాత నీ గర్భములో నుండి వచ్చిన నీ సంతతిని హెచ్చించి రాజ్యమున అతనికి స్థిరపరచెదను. అతడు నా నామ ఘనత కొరకు ఒక మందిర మును కట్టించును, అతని రాజ్య సింహాస నము ను నేను నిత్యముగా స్థిరపరచె దను. నీ మట్టుకు నీ సంతానమును, నీ రాజ్యమును నిత్యము స్థిరమగును, నీ సింహాసనమ నిత్యము స్థిరపరచ బడును అనెను తనకు కలిగిన దర్శనమంతటిని బట్టి యీ మాటలన్నిటి చొప్పున నాతాను

దావీదు నకు వర్తమానము తెలియ జెప్పెను" (2 సమూ 7:12, 13; 16-17).

ఇక్కడ ప్రవక్త యెవరిని గూర్చి చెప్పుచున్నాడు? క్రీస్తు యొక్క అపొస్తులుడైన పేతురు ఆదర్శనము యొక్క నెరవేర్పే క్రీస్తని వక్కాణించాడు (అపొ.కా. 2:30). పేతురు మాట్లాడు చుండగా క్రీస్తు ఆ సింహాసనము పై ఆసీనుడైయుండెనని అతడు చెప్పాడు (అపొ.కా. 2:32-36). పేతురు ఈ మాటలను క్రీ॥శ 33లో పలికెను. క్రీస్తు ఆ సింహాసనము నుండి వైదొలగెనని బైబిలు ఎక్కడా చెప్ప నందున ఆయన ఇప్పుడు కూడా ఆ సింహాసనాసీనుడై యున్నాడనుట సమంజసమే. క్రీస్తు తన పరిశుద్ధులతో భూమి మీద వెయ్యేండ్లు పాలించునని వెయ్యేండ్ల పాలన వాదులంటారు. బైబిలు ప్రకారము క్రీస్తు ఆ సింహాసనము పై యున్నప్పుడు దావీదు తన సమాధిలో యుండును (2సమూ 7:2). వెయ్యేండ్ల పాలన వాదులు క్రీస్తుతో భూమి మీద నీతిమంతు లుందురని దుష్టులందరు నరకములో యుందురని బోధించుదురు గనుక వారి బోధను బట్టి దావీదును నరకములో పడవేసారు!

**మూడు సింహాసనములు ఒక్కటే**

మనమడుగ వలసిన మూడవ ప్రశ్నయేమంటే : దేవుని సింహాసనము, క్రీస్తు సింహాసనము, దావీదు సింహాస నము ఈ మూడు ఒక్కటేనా? సొలొమోను దావీదు సింహాసనము పై నుండి ఏలెను (1రాజులు 2:12). గాని 1 దినవృ 29:23 ప్రకారము అది యెహోవా సింహాసనము. సొలొమోను సింహాసనమే, ఇశ్రాయేలు రాజ్యము యొక్క సింహాసనము (1రాజులు 1:37, 46,47). క్రీస్తు దావీదు సంతానమై యున్నారు. "యేసుక్రీస్తు శరీరమును బట్టి దావీదు సంతానము గాను మృతులలో నుండి పునురుత్థాను డై నందున పరిశుద్ధమైన ఆత్మను బట్టి దేవుని కుమారుడుగాను ప్రభావముతో నిరూపింపబడెను" (రోమా 1:2-7; అపొ.కా. 13:33). దేవుడు దావీదు సింహాసనమును క్రీస్తుకు యిచ్చెను (లూకా 1:3-33). క్రీస్తు సింహాసనమే దావీదు సింహాసనము (ప్రక 3:21). గనుక

యెహోవా సింహాసనము, క్రీస్తు సింహాసనము, దావీదు సింహాసనము అన్నీ ఒక్కటే.

**భూమి నుండి పరలోకము వరకు**

నాలుగవ ప్రశ్నయేమంటే : దావీదు సింహాసనమును దేవుడు నిత్యముగా ఎక్కడ స్థిరపరచారు? "నేను ఏర్పరచుకొనిన వానితో నిబంధన చేసి యున్నాను. నిత్యము నీ సింహాసనమును స్థిరపరచెదను. తరతరములకు నీ సింహాసనమును స్థాపించెదనని చెప్పి నా సేవకుడైన దావీదుతో ప్రమాణము చేసి యున్నాను. "నా నిబంధనను నేను రద్దు పరచను, నా పెదవుల గుండా బయలు వెళ్లిన మాట మార్చను. అతని సంతానము శాశ్వతముగా ఉండుననియు, చంద్రుడున్నంత కాలము అది నిలుచుననియు మింటకుండు సాక్షి నమ్మకముగా ఉన్నట్లు అది స్థిరపరచ బడుననియు, నా పరిశుద్ధతతోడని నేను ప్రమాణము చేసితిని, దావీదుతో నేను అబద్ధమాడను" (కీర్తన 89:3-4; 34-37).

మన ప్రశ్నకు జవాబు విశదముగానేయున్నది. దావీదు సంతానమునకు అతని సింహాసనముండునని దేవుడు చెప్పారు. అది నిరంతరము భూమిమీద గాక పరలోకమందు నమ్మకమైన సాక్షిగా యుండునని ఆయన చెప్పారు. ఆయన తన వాగ్ధానమును మార్చనని కూడ చెప్పారు. గనుక ఊహాజనితమైన ఏదో ఒక సింహాసనము పై క్రీస్తు కూర్చొందు కాలమేమియు ఉండనేవుండదు. ఆయన దూతలందరి కంటే పైగా హెచ్చింపబడియున్నారు (హెబ్రీ 1:13; కీర్తన 110:1). దేవుని కుడి పార్శ్వమున కూర్చుండుటకాయన పునరుత్థానుడయ్యారు (కీర్తన 16:8-10; అపొ.కా. 2:25-36). కీర్తన 16, 89లో చెప్పబడిన ప్రవచనముల నెరవేర్పు క్రీస్తుకాకపోతే ఆయన మృతులలోనుండి పునరుత్థానుడవనక్కరలేదు. ఆయన రెండవ రాకడ వరకు సమాధిలోనే యుండ వచ్చును. అప్పుడు యెరూషలేములో ఆయన సింహాసనము ఆయన కనుగ్రహింప బడును అని వెయ్యేండ్ల పాలన వాదులు చెప్పేది అసత్యము.

- కీత్ మోషెం

# కల్లలాడు నాలుక

## ( A Lying of Tongue )

దేవుని వాక్యమును ప్రతి పంక్తిలోను ఘనపరచుచు వ్రాయబడిన కీర్తనలో "నీ ఉపదేశములన్నియు యదార్థములని నేను వాటిని మన్నించుచున్నాను. అబద్ధమార్గములన్నియు నా కసహ్యములు" అని దావీదు వ్రాసాడు (కీర్తన 119:128). కీర్తనకారుని అనుకరించుచు క్రైస్తవుడు ప్రతి అబద్ధ మార్గమును అసహ్యించుకొనవలెను. సామెతలు గ్రంధకర్త "కల్లలాడు నాలుకను గూర్చి" చెబుతు అది యెహోవాకు అసహ్యమని తెలియజేసాడు. పాత క్రొత్త నిబంధనలను చదువుట ద్వారా కల్లలాడు నాలుక దేవుని దృష్టిలో చిన్న పాపమేమియు కాదని గ్రహించుకోలగము.

అబద్ధమునకు జనుకుడైన సాతాను వలన పాపము ఈ లోకములో ప్రవేశించెను. నిషేధింవబడిన ఫలమును గూర్చి దేవుడు నిశితముగా ఆజ్ఞాపించినను, వెూనవూరిత నాలుకతో, "సర్పము మీరు చావనే చావరు; ఏలయనగా మీరు వాటిని తిను దినమున మీ కన్నులు తెరువబడుననియు మీరు మంచిచెడ్డలను ఎరిగినవారై దేవతలవలె ఉందురనియు దేవునికి తెలియునని స్త్రీతో చెప్పి" వారిని మోసగించాడు (ఆదికా 3:4,5). అబద్ధమునకు జనకుడైన సాతాను అబద్ధమాడజాలని దేవుని ఇక్కడ నిందించాడు. సాతాను చెప్పిన అబద్ధమును హవ్వనమ్ముట వలన ప్రపంచమునంతటిని చీకటిలోనికి త్రోసి వేసాడు. ఈ అంధకారములో బంధింపబడినవారిని లోకమునకు వెలుగైన యేసుక్రీస్తు విమోచించవలసి వచ్చినది. నాటి నుండి నేటి వరకు కల్లలాడు నాలుక అల్లకల్లోలమును సృష్టించుచు యున్నది.

దేవుని స్నేహితుడైన అబ్రాహాము, తన ప్రాణమును గూర్చి భయపడినవాడై రెండుమారులు తన భార్యను

గూర్చి అన్యజనుల ఏలికల యొద్ద అబద్ధమాడాడు. శారా తన భార్య గాక సోదరియని వారి యొద్ద అబద్ధ మాడాడు (ఆది.కా. 12:20).

ఆదికాండము 26లో అబ్రాహాము కుమారుడైన ఇస్సాకు కూడ తన భార్యను గూర్చి అట్లే అబద్ధమాడాడు. ఈ అబద్ధములాడే సంఘటనలలో అతివిశాదకరమైనది ముసలివాడైన ప్రవక్తయొకడు యౌవనస్థుడైన ప్రవక్తకు దేవుడు తెలియ జేసినది గాక మరింకొక సమాచారాన్ని దేవునిదూత తనకు తెలియజేసెనని ఆ ముసలి ప్రవక్త యౌవనస్థుని దగ్గర నమ్మబలికాడు. గాని 1 రాజులు 13:18 అతడు అబద్ధమాడెనని తెలియ జేయుచున్నది.

అబద్ధమును నమ్మినందున యౌవనస్థుడైన ప్రవక్త తన ప్రాణమును కోల్పోయెను. అబద్ధబోధల వలన సంభవించు తీవ్ర పరిణామములను యిది మనకు ఉదాహరించుచున్నది. దేవుని సువార్తికులము, పరిశుద్ధాత్మ నడిపింపు గలవారము అని చెప్పుకొనువారి మాటలు "యెహోవా నుండి వచ్చిన వాక్యమునకు విరుద్ధముగా'' యుంటాయి. అపో.పౌలు ఇట్లు చెప్పాడు. "మేము మీకు ప్రకటించిన సువార్త గాక మరియొక సువార్తను మేమైనను పరలోకమునుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించిన యెడల అతడు శాపగ్రస్థుడవును గాక" (గలతీ 1:8).

1 యోహాను 4:1లో అపో. యోహాను ఇట్లు హెచ్చరికచేసాడు : "ప్రియులారా అనేకులైన అబద్ధప్రవక్త లు లోకములోనికి బయలువెళ్ళి యున్నారు గనుక ప్రతి ఆత్మను నమ్మక ఆయా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి". అయితే విచారం యేమంటే నేటి మతసంబంధ లోకములో అనేకులు సత్యమును నమ్మక అసత్యమునే వెంబడించు చున్నారు. ఇట్టి భయంకరమైన మోసమును గూర్చి పౌలు ముందుగనే

హెచ్చరించాడు : "నశించుచున్నవారు తాము రక్షింపబడుటకై సత్యవిషయమైన ప్రేమను అవలంబింపకపోయిరి గనుక వాని రాక అబద్ధ విషయమైన సమస్త బలముతోను, నానావిధము లైన సూచకక్రియలతోను, మహత్కార్యములతోను, దుర్నీతిని పుట్టించు సమస్త మోసముతోను నశించుచున్న వారిలో సాతాను కనుబరచు బలమును అనుసరించి యుండును. ఇందుచేత సత్యమును నమ్మక దుర్నీతియందు అభిలాష గలవారందరు శిక్షావిధి పొందుటకై అబద్ధమును నమ్మునట్లు మోసముచేయు శక్తి దేవుడు వారికి పంపుచున్నాడు" (2 థెస్స 2:9-12).

దేవుని బిడ్డయైనవాడు మత ప్రపంచములోయున్న అబద్ధములను ఎదుర్కొనుటయే గాక తనదైనందిన జీవితములో అబద్ధములాడుటకు నిరాకరించాలి. అబద్ధమాడుటను గూర్చి బైబిలులో చెప్పబడిన దానిని మనం ఉపేక్షించకూడదు. సామెతలు 6:17లో చెప్పబడినయట్లు మాత్రమే గాక ప్రతివిధమైన మోసపూరిత చర్యను బైబిలు ఖండించు చున్నది. "అబద్ధమాడు పెదవులు యెహోవాకు హేయములు, సత్యవర్తనులు ఆయన కిష్టులు" (సామె 12:22). "అబద్ధము లాడు వాడు తాను నలుగగొట్టిన వారిని ద్వేషించును. ఇచ్చకపుమాట లాడు నోరు నష్టము కలుగజేయును" (సామె 26:28).

క్రొత్త నిబంధన కూడ పైన చెప్పబడిన మాటలను బలపరచు చున్నది : "మనము ఒకరికొకరము అవయవములై యున్నాము. గనుక మీరు అబద్ధమాడుట మాని ప్రతి వాడును తన పొరుగు వానితో సత్యమే మాటలాడవలెను" (ఎఫెసీ 4:25). అవుసరమొచ్చినప్పుడు క్రైస్తవులు అబద్ధమాడవచ్చునని పౌలు చెప్పలేదు. దీనిని గమనించవలెను. యిది బైబిలు బోధకాదు "మీరు అబద్ధమాడుట మాని" యని అతడు హెచ్చరించాడు. ఏలయనగా వారు క్రీస్తును ధరించు కొన్నారు. క్రీస్తులో నూతన జీవము

కలిగి యున్నారు.

కొలస్సయులకు కూడ ఈ అపోస్తులుడు ఇటువంటి హెచ్చరికనే యిచ్చియున్నాడు. "ఒకనితో ఒకడు అబద్ధమాడకుడి; ఏలయనగా ప్రాచీన స్వభావమును దాని క్రియలతో కూడ మీరు పరిత్యజించి జ్ఞానము కలుగు నిమిత్తము దానిని సృష్టించిన వాని పోలిక చొప్పున నూతన పరచబడు చున్న నవీన స్వభావమును ధరించు కొని యున్నారు" (కొలస్స 3:9,10).

క్రైస్తవుడు తన రక్షకుని యొక్క సారూప్యములోనికి పరిపూర్ణముగా మార్చబడాలని ప్రగాఢముగా కాంక్షిం చాలి. "పిరికి వారును, అవిశ్వాసు లును, అసహ్యులును, నరహంతకు లును, వ్యభిచారులును, మాంత్రికు లును, విగ్రహారాధకులును, అబద్ధి కులందరును అగ్ని గంధకము లతో మండు గుండములో పడవేయ బడుదురు. ఇది రెండవ మరణము" (ప్రక 21:8).

– జిమ్ డియర్‌మెం

# అన్య భాషలు

## ( The unknown Tongues )

క్రైస్తవులమని చెప్పుకొను వారిలో కొందరు అద్భుత రీతిగ అన్యభాషలు మాటలాడు శక్తి వారికున్నదని ఈనాడు కూడ చెప్పుకొందురు. దేవుని ఆత్మ వారి ద్వారా మాట్లాడుచున్నదని వారు చెప్పుదురు. వారు మాట్లాడు చున్నది వారికి గాని, వినుచున్న వారికి గాని తెలియదనియు, అది కేవలము దేవునికే తెలియుననియు వారు చెప్పుదురు. అయితే వారు చెప్పు ఈ సంగతులు ఎంతమట్టుకు నమ్మదగినవి? బైబిలు అన్యభాషలు మాట్లాడుటను గూర్చి ఏమి చెప్పుచున్నది? దీని విషయమై ఈరోజు కొంత తెలిసికొందము.

భాషతో మాట్లాడుటను గూర్చి బైబిలు చెప్పుచున్నది. యేసుక్రీస్తు

యొక్క అపొస్తలులును, మొదటి శతాబ్ధములో నివసించిన కొందరు క్రైస్తవులును అద్భుత రీతిగ వివిధ భాషలతో మాటలాడినట్లు బైబిలులో మనకు కన్పించును. వారు అన్య భాషలతో మాటలాడిరి యనగా వారెన్నడు నేర్చుకొనని భాషతో మాట్లాడిరి యని అర్ధము. వారు ఎన్నడు నేర్చుకొనని భాషతో మాటలాడుట ఒక గొప్ప అద్భుతము. ఇది పరిశుద్ధాత్మని శక్తి వలన కలిగెను.

**రెండు విధములుగా ఈ వరము**

ఈ వివిధ భాషలతో మాటలాడుట యను అద్భుతము మొదటి శతాబ్ధములో రెండు విధములుగ జరిగించబడెను. మొదటిది, పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందినవారు వేర్వేరు భాషలతో మాటలాడిరి. ఈ సందర్భమును గూర్చి మనము అపొస్తులుల కార్యములు రెండవ అధ్యాయములోను, పదియవ అధ్యాయములోను చదువగలము. రెండవది అపొస్తలులు కొందరిమీద చేతులుంచగా, చేతులుంచబడినవారు వేర్వేరు భాషలతో మాటలాడిరి. ఈ సందర్భమును గూర్చి అపొ.కా. 19:6లో మనము చదువగలము.

ఈ విధముగ క్రొత్తభాషలు మాటలాడువారు ఇంకా కొన్ని అద్భుతములను అనగా క్రీస్తు నామమున దయ్యములను వెళ్ళ గొట్టుట, పాములను ఎత్తి పట్టుకొనుట, విషమును త్రాగుట, రోగులను స్వస్థ వర్చుటయను వాటిని చేయుదురని యేసుప్రభువు చెప్పెను (మార్కు 16:17,18). అయితే నేడు అన్య భాషలు మాటలాడు వారిలో ఇవన్నియు చేయగలుగు చున్నామని చెప్పుకొను వారెవరును లేరు.

**వాక్యమును స్థిరపరచుటకు**

క్రొత్తభాషలతో మాటలాడుట, వివిధ అద్భుతములు చేయుట అన్నునవి క్రొత్త నిబంధన వాక్యమును స్థిరపర్చు టకు మొదటి శతాబ్ధములో ఈయబడె నని దైవవేదము బోధించుచున్నది. పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిన

అపొస్తలులు "బయలుదేరి వాక్యమంతట ప్రకటించిరి. ప్రభువు వారికి సహకారుడై యుండి వెనువెంట జరుగుచు వచ్చిన సూచక క్రియల వలన వాక్యమును స్థిరపరచుచుండెను" అని మార్కు 16:20లో వ్రాయబడి యున్నది. క్రొత్తనిబంధన స్థిరపరచ బడగానే అద్భుత వరములన్నియు ఆగిపోయెను. గనుక నేడు మన మధ్య అద్భుతములు చేయగలవారెవరును లేరు. వాటి ప్రయోజనము శూన్యము.

కొరింధు సంఘములో మొదటి శతాబ్ధములో పరిశుద్ధాత్మని శక్తి వలన క్రొత్త భాషలు మాటలాడ గలవారుండిరి. వారికి ఈ క్రొత్త భాషల యొక్క ప్రయోజనమును గూర్చి వ్రాయుచు అపొ.పౌలు, "భాషలు విశ్వాసులకు కాదు, అవిశ్వాసులకే సూచకమై యున్నది" అని బోధించెను (1 కొరింధి 14:22). పౌలు అట్లు బోధించితే ఈనాడు ఏమి జరుగుచున్నది? ఈనాడు విశ్వాసుల సభలలోనే ఈ భాషలు మాట్లాడుట జరుగుచున్నది.

అర్థము చేసికొనదగునది

'భాష' అనునది, అర్థము చేసి కొనదగు మాటలు అని మన మెరుగుదుము. గనుక మొదటి శతాబ్ధములో అద్భుత రీతిగ మాటలాడిన వారు వారెన్నడు నేర్చుకొనని భాషలలో మాటలాడిరని మనము గ్రహించవలెను. క్రొత్తభాషలతో మాటలాడు శక్తిని మొదటి శతాబ్ధములో కొందరికి దేవుడు ఎందుకు ఇచ్చెను? వారు వేర్వేరు దేశములకు వెళ్ళి, ఆ దేశ భాష నేర్చుకొనవసరము లేకుండ, ఒక అనువాదకుని సహాయము లేకుండ సువార్తను ప్రకటించుటకు ఈ శక్తి ఈయబడెను. అది ఎంతకాలమట్టుకు ఉండెను? క్రొత్త నిబంధన పూర్తిగ వ్రాయబడు వరకు ఉండెను. అందుకే అద్భుతములు, భాషలు నిలిచిపోవునని మొదటి శతాబ్ధములోనే అపొ.పౌలు 1 కొరింధి 13:8లో హెచ్చరించెను.

గనుక అద్భుతరీతిగ ఆనాడు అన్య భాషలు ఎవరైన మాట్లాడితే వారు వేరొక భాషలో మాట్లాడిరే గాని అర్థము లేని రణ గొణ ధ్వనినిమాత్రము వారు

చేయలేదు. పెంతెకోస్తు దినమున పరిశుద్ధాత్ముడు అపొస్తులులు ఒక్కొక్కని మీద వ్రాలగ, ఆ ఆత్మ వారికి వాక్‌శక్తిని అనుగ్రహించిన కొలది అన్యభాషలతో వారు మాటలాడసాగిరి (అపొ.కా. 2:4). ఆనాడు పలు ప్రాంతముల నుండి కూడివచ్చిన జనులు ప్రతి మనుష్యుడు తన తన స్వభాషతో అపొస్తులులు మాటలాడుట విని, మనలో ప్రతివాడు తాను పుట్టిన దేశపు భాషతో వీరు మాటలాడుట మనము వినుచున్నామే, ఇదేమి? వీరందరు గలిలయులు కారా? యని ఆశ్చర్య పడిరి (అపొ.కా.2:5-11). పరిశు ద్ధాత్ముని శక్తి వలన అన్యభాషలు కలుగగా వాటిని అర్ధము చేసికొను వారు అక్కడయుండిరి. వారు తమ స్వభాషలో దేవుని గొప్పకార్యములు వినగల్గునట్లు ఆ యద్భుతము జరిగెను. అయితే ఆధునిక అన్యభాషలు పలుకు వారు మాట్లాడునది యేమిటి? అది ఒక భాషా? కానేకాదు. కేవలము అల్లరితోకూడిన ధ్వనియే గాని అదొక భాషకాదు. అందుకే "పరిశుద్ధుల సంఘములన్నిటిలో దేవుడు సమాధానమునకే కర్త గాని అల్లరికి కర్త కాడు" అని అపొ.పౌలు 1 కొరింధి 14:33లో హెచ్చరించెను.

అన్యభాషలను గూర్చి అపొ.పౌలు కొరింధీయులకు ఇట్లు వ్రాసెను : "భాషతో ఎవడైనను మాటలాడితే ఇద్దరు, అవసరమైన యెడల ముగ్గురికి మించకుండ వంతులచొప్పున మాట లాడవలెను. ఒకడు అర్ధము చెప్ప వలెను. అర్ధము చెప్పువాడు లేనియెడల అతడు సంఘములో మౌనముగా యుండవలెను" (1కొరింధి 14:27, 28). "అలాగే మీరు స్పష్టమైన మాటలు నాలుకతో పలికితేనే గాని పలికినది ఏలాగు తెలియును? మీరు గాలితో మాట్లాడుచున్నట్టుందురు" (1 కొరింధి 14:9). "నేను మీ యందరి కంటే ఎక్కువగా భాషలతో మాటలాడు చున్నాను; అందుకు దేవుని స్తుతించె దను. అయినను సంఘములో భాషతో పదివేల మాటలు పలుకుటకంటే, ఇతరులకు బోధ కలుగునట్లు నా మనస్సుతో అయిదు మాటలుపలుకుట

మేలు" అని 1 కొరింథి 14:19లో అతడు వ్రాయుచు భాషలతో మాటలాడుట కతడు ఎంత ప్రాముఖ్యత యిచ్చెనో అప్పుడే తెలియ జేసెను.

**పరిశుద్ధాత్మ బాప్తిస్మము నేడు లేదు**

ఈనాడు అన్యభాషలలో మాట లాడువారు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందనివారు. పరిశుద్ధాత్మ బాప్తిస్మము వారి కొరకు కాదు, అపొస్తులులకే వాగ్దానము చేయబడినదని గ్రహించ వలెను. అపొస్తులు లందరు ఏనాడో మరణించిరి. గనుక వారి ద్వారా అద్భుత శక్తి ప్రసారమయ్యే విధానము మరొకటిలేదు. అన్యభాషతో మాట లాడుట యనగా అర్ధములేని శబ్దములు చేయుట కాదు. అన్యభాషలు అవిశ్వాసుల కొరకే గాని, విశ్వాసుల కొరకు కాదని మనము గ్రహించ వలెను. నేడు కొందరు మాట్లాడు చున్నది అన్యభాష కాదు; అది ఒక భాష కాదు. మాట్లాడువారికి, వినుచున్న వారికి ఆ భాష ఏమిటో అర్ధము కాని యెడల దాని ప్రయోజన మేమిటి? శూన్యము!! క్రొత్త నిబంధన రోజులలో యిట్లు లేదు. గనుక ప్రజలకు ఆనాడున్న శక్తి నేడు లేదు.

నేడు భాషలున్నవని, వాటితో మాట్లాడుచున్నామని వటించుచున్న వారి బోధకులు తమ రాష్ట్రమును వదలి వేరొక రాష్ట్రమునకు లేక దేశమునకు వెళ్ళిన యెడల వారు అద్భుతరీతిగ ఆ ప్రదేశపు భాషలో బోధించుట లేదు. సరిగదా అనువాదకుల ద్వారా వారు మాట్లాడుదురు. గనుక మొదటి శతాబ్దపు అన్యభాషలకును, నేటి అన్య భాషలకును ఆకాశము భూమికున్నంత వ్యత్యాసమున్నది. మొదటిది దేవుని వలన కలిగినది. నేటిది ప్రజలను మోసగించుటకు అపవాది వలన కలిగినది.

"ప్రేమ శాశ్వతకాలముండును. ప్రవచనములైనను నిరర్ధకములగును; భాషలైనను నిలిచిపోవును; జ్ఞానమై నను నిరర్ధకమగును...పూర్ణమైనది వచ్చినప్పుడు పూర్ణముకానిది నిరర్ధక మగును" అని 1 కొరింథి 13:8-10 లో అపొ.పౌలు బోధించెను. పూర్ణమైన

క్రొత్తనిబంధన మనకు స్థిరపరచబడి ఇయ్య బడినది (యాకోబు 1:25). పూర్ణము కాని భాషలు, ప్రవచనములు వెము।।నవి పౌలు చెప్పినట్లే అంతమొందినవి. "కాగా విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ యీ మూడును నిలుచును. వీటిలో శ్రేష్టమ యినది ప్రేమయే" (1కొరింధి13: 13).

నీవు రక్షింపబడు నిమిత్తము యేసుక్రీస్తును, ఆయన వాక్యమును నమ్మి లోబడుము. మనుష్యులచే మోసగించబడక సత్యమును ప్రేమతో చేబట్టి దానికి విధేయుడవుకమ్ము, ఇది నా ప్రేమపూర్వకమైన హెచ్చరిక!!.

– జాషువా గూటం

## కాలము గడిచిపోవు చున్నది

### ( Time is Running Out )

మనం ఆత్మలను సంపాదించుట లో విజయం సాధించాలంటే కొన్ని సంగతులు అవసరం.

1. నశించిన ఆత్మలను రక్షించాలనే హృదయాభిలాష మొదట మనకుండాలి. ఆయభిలాష పెరగా లంటే దాన్ని అలవరచుకోవాలి. ఆత్మలను వెదకడానికి అది మనలను నడిపించాలి. మనం దినమంతా పని చేసుకొన్నా, ఎవరికో ఒకరికి క్రీస్తును గూర్చి చెప్పడానికి మనం ఆసక్తి కలిగి యుండాలి.

2. ఆత్మలను సంపాదించేవారు జాలి గలిగియుండాలి, ప్రేమ కలిగి యుండాలి. నశించిన వారి యాత్మలను రక్షించుటలో విజయానికీ, విఫలానికీ తేడా మనం ప్రజలను ఏ రీతిగా ఎదుర్కొనుచున్నామో దానిపై ఆధారపడి యుంటాది. దయ చాల ప్రాముఖ్యం. దయ గలిగి మాట్లాడితే ప్రజలు సాఫీగా వింటారు. ఇతరులు మనతో సంభాషించునపుడు ఎట్లుండా లని కోరుకొంటామో అట్లే మనము కూడా యుండాలి. వారిప్రశ్నలకు తగురీతిగ జవాబు వచ్చువరకు మనం

బోధించాలి. మనం సున్నిత భావాలు గలవారితో మాట్లాడుచున్నాం గనుక సున్నితంగానే యుండాలి.

3. మనం ఆత్మవిశ్వాసము కలిగి యుండాలి. క్రీస్తును గూర్చి క్రైస్తవ్యమును గూర్చి వినడానికి ప్రజలు ఆసక్తి కలిగియున్నారని మనం నమ్మాలి. మనం ఎవరికి సువార్త బోధించుచున్నామో, వారు చివరకు బాప్తిస్మము పొంది ప్రభువులో ప్రవేశిస్తారని నమ్మాలి. వారి ప్రశ్నలకు జవాబియ్యగలమని, వారు అర్థం చేసుకొని రక్షింపబడాలంటే యేమిచేయ వలెనో తెలిసికొందురని నమ్మాలి. యిది జరిగినప్పుడు వారు తప్పక ప్రభువుకు లోబడ్తారు, దేవుడు ప్రతిఫలం దయచేస్తారు.

మనకున్నా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. క్రీస్తుకు వెలుపల అనేకులు అనుదినం మరణించు చున్నారు. సువార్త వినే తరుణం అట్టివారికి కల్పించబడాలి. సహోదరులారా, సమయం ఉండగా సువార్త బోధించే తరుణం నీవు నేను కలిగియున్నాము. నశించిపోవుచున్న లోకానికి సువార్త తీసుకెళ్ళడానికి ఆయన సేవకులైన మనకు బాధ్యత అప్పగించబడింది. కోత విస్తారముగా యున్నది గాని పనివారు కొందరే. ఆత్మలు సంపాదించువానిగా యుండుటకు నీవు నిశ్చయించుకోవలెను. నీతో కూడా పరలోకమునకు మరికొందరు చేరుకొనునట్లు చూడవలెను. కాలం గడిచిపోతుంది. పగలున్నంతవరకు మనం పనిచేయాలి!

– డేల్ గ్రిస్సమ్

**YOU TUBE లో**

**సత్యవాణి కార్యక్రమములను 24 గంటలు చూడండి**

**Satyavanicoc.kda అని క్లిక్ చేయండి**

# సంక్షిప్త వార్తలు

2018 అక్టోబరు 15,16,17 తేదీలలో రంపచోడవరంలోని క్రీస్తు సంఘము గొప్ప బైబిలు లెక్చర్‌షిప్‌ను నిర్వహించిరి. రంపచోడవరములోను, తూర్పుగోదారవరి జిల్లాలో పలుప్రాంతములలోను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములోను దేవుని సేవను ఘనముగా అనేక సంవత్సరములు నిర్వహించిన సోదరులు బర్రే రత్నంగారి ఆధ్వర్యములో వారి కుమారుడు జాన్ రత్నం గారి పర్యవేక్షణలో ఈ బైబిలు లెక్చర్‌షిప్ విజయవంతముగా మూడు దినములు నిర్వహించబడెను.

ఆ మూడు దినములలోను సోదరులు ఎన్. సొలొమోను రాజు గారి (తుని) అధ్యక్షతను కూటములు కొనసాగెను. సోదరులు జి. సువర్ణరాజు (భద్రాచలం), జాషువాగూటం, పి.యస్.ఆర్. జయపాల్ (ర్యాలి), టి. జ్ఞాన సుధీర్ (కాకినాడ), కె.జి. కుమార్, జాన్‌డీన్, సువర్ణకుమార్, జాన్ అబ్రహాం, బర్రే జాన్‌రత్నం గార్లు తదితరులు వాక్యపరిచర్య చేసిరి. వందలాది సువార్తికులు, సభ్యులు, స్త్రీలు, పురుషులు పలు ప్రాంతముల నుండి హాజరై గొప్ప ఆత్మీయాను భూతిని ఆస్వాదించిరి. హాజరైన వారందరికీ రంపచోడవరం క్రీస్తుసంఘ విశాల ఆవరణములో ఉచిత భోజన వసతి సౌకర్యములు కల్పించబడెను.

పై మూడు దినములలోను అదే ఆవరణలో స్త్రీలకు ప్రత్యేక బైబిలు తరగతులు నిర్వహించబడెను. సోదరీలు శోభారాణి, కబితా గూటం, రత్న కుమారి, సంధ్యారాణి, సుజనారంజిని, జెమీమా, ఇందిరా జాన్‌రత్నం గార్లు స్త్రీలకు చక్కటి వాక్యపరిచర్య చేసిరి. హాజరైన ముఖ్య ప్రసంగీకులకు జాన్‌రత్నం గారి సతీమణి ఇందిరా జాన్ రత్నం గారు చక్కటి ఆతిధ్యమిచ్చి వారి నుండి మన్ననలను పొందిరి.

రంపచోడవరములోను, పలు పట్టణములలోను సోదరులు బర్రే రత్నం గారు క్రీస్తుపనితో బాటు ఇంజనీరింగ్ కాలేజీలు, డెంటల్ కాలేజీ, డిగ్రీకాలేజీలు, స్కూళ్లు అనేకములు స్థాపించి గొప్పపనిచేసియున్నారు. ప్రస్తుతము వయోభారము వలన ఆయన ఆరోగ్యము బాగోలేకపోయినను ప్రతీకూటమునకు ఆయన హాజరై ఆయనకున్న స్థిరవిశ్వాసమును ఘనముగా చాటించిరి. ఆయన ప్రారంభించిన

పనిని ఆయన కుమారుడు జాన్‌రత్నం గారు సమర్ధవంతముగా నడుపుచున్నారు. అందుకు దేవునికి స్తోత్రలు.

2018 అక్టోబరు 17,18,19 తేదీలలో రాజోలు మండలం చెన్నాడంలో యున్న క్రీస్తుసంఘము గొప్ప బైబిలు సెమినార్‌ను నిర్వహించిరి. దానిలో సోదరులు యి.కె.వి. ప్రసాదరావు, జాషువా గూటం, వి. చిన్నయ్యా, ఆర్. రంగారావ్ (కోరుకొండ), సి.హెచ్.ప్రసాద్ (అమలాపురం), సి. హెచ్. మోజస్ (అంబాజీపేట) గార్లు మంచి వాక్యపరిచర్య గావించిరి. స్థానిక సంఘము వచ్చిన వారందరికీ మంచి భోజనములు ఏర్పాటుచేసిరి. హాజరైన వారందరినీ ఆప్యాయతతో ఆదుకొనిరి. ప్రతి ప్రసంగము ఫేస్‌బుక్ ద్వారా ప్రపంచానికంతటికీ ప్రసారము చేయబడెను. కడలి, తూర్పుపాలెం, చెన్నాడం తదితర ప్రాంతములలో సోదరులు వి. చిన్నయ్యా గారు సతీసమేతముగా అనేక సంవత్సరముల నుండి క్రీస్తు కొరకు గొప్ప కృషి చేయుచు మంచి ఫలితమును సాధించుచున్నారు.

**RNI Regd. No. 69973/98**
**Postal Regd.No. AP/KD-02/2018-20**

**From :**
**SATYAVAKKU**
**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.